ఉచితం.. ఇసుకాసుల వర్షం

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్వర్ణముఖి నది కూటమినేతలకు కల్పతరువుగా మారింది. ప్రభుత్వం తెచ్చిన ఉచిత ఇసుక విధానం కూటమి నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. కార్పొరేట్ కంపెనీలు, కాంట్రాక్టర్లతో కూటమి నేతలు కుమ్మక్కై దోచుకుంటున్నారు. జేసీబీలు, హిటాచీలతో భారీ యంత్రాలతో టిప్పర్లలో నింపుకుని యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో డంపింగ్ చేసి కార్పొరేట్లకు అమ్ముకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇసుక విధానంతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. సంక్షేమ పథకాలు కూడా అమలు చేయగలిగారు.




పెన్నలపాడు స్వర్ణముఖి నదీ తీరంలో హిటాచీతో టిప్పరులోకి ఇసుకను నింపుతున్న దృశ్యం, పొలాల పక్కనే డంప్ చేసిన అక్రమ ఇసుక

- ఇష్టారీతిన ఇసుకను తరలిస్తున్న కూటమి నేతలు
- కార్పొరేట్ కంపెనీ వ్యక్తులతో కుమ్మక్కై అక్రమ రవాణా
- నదులు, వాగులు, వంకల్లో భారీ యంత్రాలతో ఇసుక తోడుతున్న వైనం
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- సామాన్య, మధ్యతరగతి ప్రజలకు తప్పని ఇసుక కష్టాలు



పెన్నలపాడు స్వర్ణముఖి నదీ తీరంలో..

శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా పార్టీల నేతలకు ఇసుక ఆర్థిక వనరుగా మార్చుకున్నారు. ఇష్టారీతిన ఇసుక అక్రమ రవాణా చేయిస్తూ కూటమి నేతలు కోటీశ్వరులుగా మారుతున్నారు. శ్రీకాళహస్తి మండలంలో రామలింగాపురం, చుక్కలనిడిగల్లు, సుబ్బానాయుడుకండ్రిగ ప్రాంతాల నుంచి ఇసుక అత్యధికంగా అక్రమ రవాణా జరుగుతోంది. తొట్టంబేడు మండలంలో పెన్నలపాడు, విరూపాక్షిపురంలో భారీ యంత్రాలతో టిప్పర్లకు నింపి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ కాంట్రాక్టరుకు సుమారు 3 వేల యూనిట్లు చుక్కలనిడిగల్లు నుంచే తోలడం జరిగింది. కూటమి నేతలు తప్ప ఇంకెవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే వెంటనే పోలీసులు వారిని అరెస్టు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. చుక్కలనిడిగల్లులో 12 ట్రాక్టర్లు ఉండగా టీడీపీ నాయకుడికి చెందిన రెండు ట్రాక్టర్లకు మాత్రమే ఇసుక తోలడానికి అనుమతి ఉంది. స్థానికంగా ఉండే రెవెన్యూ అధికారులతో కుమ్మక్కు కావడంతో వారి అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. రాత్రి జేసీబీలతో పొలాల పక్కన డంపింగ్ చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్పొరేట్ల కంపెనీలు, కాంట్రాక్టర్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. తొట్టంబేడు మండలంలో అయితే ఏకంగా 6 కిలోమీటర్ల మేర రోడ్డు వేసి భారీ హిటాచీ యంత్రాలు, టిప్పర్లతో ఇసుకను తోడేస్తున్నారు. దీనిపై స్థానికులు ప్రశ్నిస్తే వారిపై దాడులకు దిగడానికి సంసిద్ధంగా ఉన్నారు. దాంతో గ్రామస్తులు, చుట్టుపక్కల వారు భయాందోళనకు గురై దీనిపై ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు.

సాగు, తాగునీటి కష్టాలు..

సాగుకు సంబంధించి స్వర్ణముఖి, చెరువులు, తెలుగుగంగ నీటిపై ఆధారపడతారు. అయితే ఉచిత ఇసుక రైతుల కొంపలు ముంచుతోంది. భారీగా ఇసుకను తోడేయడంతో భూగర్భజలాలు అడుగంటి రైతులకు సాగునీటి కష్టాలు తప్పేటట్టు లేవు. దాంతో పాటు స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో రైతులు వేసుకున్న పైపులను ట్రాక్టర్లతో తొక్కించి వాటికి సాగునీరు అందకుండా అక్రమార్కులు అడ్డుపడుతున్నారు. చుక్కలనిడిగల్లు ప్రాంతం నుంచి స్వర్ణముఖి నది పురపాలక సంఘానికి నీటిని అందించే నీటి సమీప ప్రాంతంలో ఇసుకను తోడేయడంతో పూర్తి సమ్మర్ స్టోరేజీ నుంచి తాగు నీటి కోసం ఆధారపడాల్సి వస్తోంది. కొన్ని రోజులకు దీని ద్వారా తాగునీరు కూడా అందే పరిస్థితి ఉండకపోవచ్చని చుట్టుపక్కల గ్రామస్తులు చెబుతున్నారు. ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సమాచారం వచ్చిన ప్రతిసారీ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని అయితే రాత్రుల్లో ఎత్తే విషయం తమ దృష్టికి రాలేదని వస్తే విచారించి తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

ధర్మరాజుల స్వామి తిరునాళ్లకు పటిష్ట భద్రత



ఆలయ పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీదేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు రేణిగుంట డీఎస్పీ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాత్రి పాపానాయుడుపేటలో ఉత్సవాల సందర్భంగా ప్రధాన వీధుల్లో పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం ఆలయ పెద్దలకు ఉత్సవాల్లో భక్తుల సౌకర్యాలు, భద్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐలు శ్రీకాంత్‌రెడ్డి, జయచంద్ర, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, ట్రైనీ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ట్యాంకు క్లోరినేషన్



ట్యాంకు లోపల శుభ్రం చేస్తున్న కార్మికుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు క్లోరినేషన్ పనులు చేపట్టారు. ఆదివారం ఈ మేరకు సర్పంచ్ జొన్నల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జలజశ్రీ పర్యవేక్షణలో ట్యాంకు చుట్టూ ముళ్లపొదలను సైతం తొలగించి, శుభ్రం చేయించారు.

మంత్రిసత్యకుమార్‌కు స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

రేణిగుంట: చిత్తూరు జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు విమానాశ్రయంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, వైద్య అధికారులు, పార్టీ నాయకులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన చిత్తూరుకు పయనమయ్యారు.

వైభవంగా అంకమ్మ కొలుపు



అమ్మవారికి నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకుని వెళ్తున్న మహిళలు

రేణిగుంట: మండలంలోని వెంకటాపురంలో వెలసిన శ్రీ అంకమ్మ తల్లికి గ్రామంలోని యాదవులు ఏటా నిర్వహించే కొలుపు మహోత్సవాలు శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు వైభవంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఇంటి నుంచి నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి గంగ పెట్టెని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో యాదవ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడ జిల్లా చేబ్రోలుకు చెందిన వంశీ రామకృష్ణ ఆదివారం రూ.51,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘గురుకుల’ంలో ప్రవేశానికి దరఖాస్తులు

సత్యవేడు: అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రసూన తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 10వ తరగతిలో 2 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ గ్రూప్‌లో 9 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. అర్హులైన విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఆటో యూనియన్‌కు కొత్త కార్యవర్గం

వరదయ్యపాళెం: స్థానిక ఆటో యూనియన్‌కు ఆదివారం నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో కొత్త కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఆంబాకం చిన్నిరాజ్, అధ్యక్షుడిగా ఎస్‌కే హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా ఎం.లక్ష్మయ్య, కార్యదర్శిగా వై. వెంకటయ్య, ఉప కార్యదర్శిగా వి. పోలయ్య, కోశాధికారిగా వి. చిన్నా, సభ్యులుగా ఎస్. రాఘవ, బి. వెంకటయ్య, ఎస్‌ఏ జాకీర్, బి. వెంకటేశు, జేకే జయశంకర్ ఎన్నికయ్యారు.

చెల్లేతమ్మకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో అమ్మవారు

నాగలాపురం: గ్రామ దేవత చెల్లేతమ్మ ఆలయంలో తమిళ ఆడినెల మూడో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకుడు జానకిరామ్ ఆధ్వర్యంలో అమ్మవారిని పసుపు, కుంకుమతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కట్ట పుట్టాలమ్మ సేవలో మాజీ ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో వెలసిన శ్రీ కట్ట పుట్టాలమ్మ వారిని ఆదివారం శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి దర్శించుకున్నారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి సేవలో పాల్గొన్న అనంతరం మాజీ ఎమ్మెల్యేకి ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేశం, జిల్లా కార్యదర్శి వెంకటరమణ, జిల్లా యువత వింగ్ ప్రధాన కార్యదర్శి దిలీప్, సుబ్రమణ్యం, బాబురావు, దీన, రమేష్, లత, రాజేష్, ఇన్బనాథన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానంపై కఠిన చర్యలు

శ్రీకాళహస్తి: బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి అన్నారు. పట్టణంలోని తుఫాన్ సెంటర్‌లో బహిరంగ ప్రదేశంలో ఉన్న మద్యంసీసాలు, చెత్తను ఆయన శుభ్రం చేయించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తే చర్యలు తప్పవన్నారు. రాత్రిపూట గస్తీ నిర్వహిస్తామని తెలిపారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి



మురళి మృతదేహం

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు.. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఇతను పట్టణంలోని సన్నిధి వీధిలోని ఓ హోటల్‌లో క్లీనింగ్ బాయ్‌గా పనిచేస్తుంటాడని, ఇతని పేరు మురళి(25) అని గుర్తించారు. ఇతను రెండు రోజుల క్రితం అతిగా మద్యం సేవించాడు. దీంతో ఎలాంటి ఆహారం తీసుకోకపోవడంతో మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో శవాన్ని కుటుంబ సభ్యుల కోరిక మేరకు పోస్టుమార్టం నిర్వహించకుండా బంధువులకు అప్పగించారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

చెరువులో కట్టడాలు తొలగింపు



కట్టడాలను తొలగిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి గ్రామంలో రైల్వే గేటుకు ముందు ప్రాంతంలో ఉన్న దుకాణాలు, కట్టడాలను రెవెన్యూ సిబ్బంది ఆదివారం తొలగించారు. చెరువును ఆక్రమించుకున్న నిర్మించుకున్న కట్టడాలను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు ఉండడంతో వాటిని తొలగిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు. ముందస్తుగా సమాచారం ఇచ్చినా వారు తొలగించకపోవడంతో తాము తొలగించాల్సి వచ్చిందని తెలిపారు. రెండు, మూడు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో వ్యాపారాలు చేసుకుని బతుకుతున్నామని ఇప్పుడు అధికారులు అక్రమ కట్టడాలు అన్నీ చెప్పి తొలగించడం భావ్యం కాదని గ్రామస్తులు అంటున్నారు. కోర్టు ఆదేశాలతో కొట్టేశామని అధికారులు అంటున్నారు.

సమన్వయంతో పార్టీ బలోపేతం



నేతలు, కార్యకర్తలతో నూకతోటి రాజేష్

కేవీబీపురం: వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కేవీబీపురం కోటమంగాపురంలో నిర్వహించిన అమ్మవారి కొలుపు, జాతరలో ఆయన పాల్గొన్నారు. దళితవాడలో ఏర్పాటు చేసిన అగ్నిగుండ హోమం రగిలించారు. అనంతరం అల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ స్థానిక నేత అల్లిబాబు ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఉషా, సర్పంచ్ తిరుపాల్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో నేతలు నందకుమార్, బాలసుబ్రమణ్యంతో కలిసి మాట్లాడారు. రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహించాలని సూచించారు. పార్టీకి దూరంగా ఉన్న నేతలు, కార్యకర్తలను మళ్లీ సొంతగూటికి తీసుకురావాలని కోరారు. నేతలు డేవిడ్, రామ్మోహన్ వర్మ, పాతపాళెం ప్రవీణ్, రాయపేడు హరి, అరుళ్, మూర్తి ఢిల్లీబాబు పాల్గొన్నారు.

తంగెళ్లపురం.. పడకేసిన పారిశుద్ధ్యం

- వీధులన్నీ మురుగుమయం
- పట్టించుకోని పంచాయతీ యంత్రాంగం
- కాలనీ వదలి వెళ్లిపోతున్న గిరిజనం




బుచ్చినాయుడుకండ్రిగ: బీఎన్‌కండ్రిగ పంచాయతీ తంగెళ్లపురం గిరిజన కాలనీలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. సమస్యల సహవాసం చేయలేక కాలనీ నుంచి 25 కుటుంబాలకు గాను 10 కుటుంబాలు వలసబాట పట్టాయి. వీధుల్లో మురుగు చేరి దుర్వాసన వెదజల్లుతూ ఉండడంతో స్థానిక గిరిజనులు అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. కాలనీలోకి ప్రవేశించాలంటే ముందుగా పేడ దిబ్బలను దాటుకునే రావాల్సి పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొళాయిలు మరమ్మతులకు గురికావడంతో తాగు నీరు వృథాగా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సమస్యలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

250 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నాగలాపురం: చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ వారు తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద నేత్రాలయా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీ శంకర్, సీఈఓ సీతారామ నాయుడు పర్యవేక్షణలో ఆదివారం సాయిబాబా మందిరంలో చేపట్టిన వైద్యశిబిరంలో 250 మందికి కంటి పరీక్షలు జరిపించారు. 85 మందికి మందులు, 56 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 80 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ట్రస్ట్ ఏఓ కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది గౌరీ శంకర్ పాల్గొన్నారు, సాయిబాబా ఆలయ నిర్వాహకుడు జగదీష్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గజవాహనంపై వీరభద్రస్వామి



ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

నారాయణవనం: భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ఉత్సవర్లు గజవాహనం అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా ఉదయం భద్రకాళీ, వీరభద్రులకు స్నపన తిరుమంజనం నిర్వహించి దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు గజవాహనంపై ఉత్సవర్లను అధిష్టింప చేశారు. స్వామి, అమ్మవారు కోటవీధులు, సెంగుందర్ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు రథోత్సవం, సాయత్రం 7.30 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.500 చెల్లించాలని సూచించారు. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవమూర్తి అశ్వవాహనంపై ఊరేగనున్నట్లు వివరించారు.

నయవంచనే బాబు నైజం



క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: నయవంచనే చంద్రబాబు నైజమని, అధికారం కోసం అబద్ధపు హామీలు గుప్పించారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్పష్టం చేశారు. ఆదివారం పిచ్చాటూరులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు చలపతిరాజు ఆధ్వర్యంలో చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. నూకతోటి రాజేష్ మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను బురిడీ కొట్టించారన్నారు. పైగా సిగ్గు చేటు అని కూడా అనుకోకుండా పథకాలన్నీ ఇచ్చేశానని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. సూపర్‌సిక్స్ పథకాల పేరెత్తితే నాలుక మందమని అనడం చంద్రబాబు అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి వంటి పథకాల ఊసే లేదని ఆరోపించారు. 40 లక్షల మంది విద్యార్థులకు తల్లికివందనం అందలేదని తెలిపారు.

ఓర్వలేకే ఆంక్షలు

జగనన్నకు వస్తున్న జనాదరణను ఓర్వలేకే అడుగడుగునా పర్యటనకు ఆంక్షలు విధిస్తున్నారని నూకతోటి రాజేష్ ఆరోపించారు. జగనన్నను బలహీన పరిచేందుకే పార్టీలోని ముఖ్య నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసి ఎలాంటి ఆధారాలను చూపలేదన్నారు. ఈ క్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా కేసు నుంచి బయటకు వస్తారని తెలిపారు. రాష్ట్రంలో అధికారం మారితే టీడీపీ నేతల పరిస్థితి దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ధీరేంద్రవర్మ, ప్రధాన కార్యదర్శి భాస్కర్ నాయుడు, నేతలు రమేష్ రాజు, సుబ్రమణ్యం రెడ్డి, సూరిబాబు రెడ్డి, చెంగల్రాయ రెడ్డి, త్యాగరాజ్, రామచంద్రయ్య, సర్పంచ్ శేఖర్, వెంకటేష్, అయ్యప్ప, భాను ప్రకాష్ రెడ్డి, ఆర్ముగంరెడ్డి, అయ్యప్ప, ప్రభాకర్ రెడ్డి, చంద్ర శేఖర్, సెల్వం, చంద్రన్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పునఃప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండలంలోని కడూరు కూడలి–చిన్న పాండూరు ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు పునః ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 4కోట్లు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ పనులు కొంత వరకు చేపట్టాడు. సార్వత్రిక ఎన్నికలు రావడం, చేసిన పనులకు బిల్లు రాకపోవడంతో కాంట్రాక్టర్ ఆపివేశాడు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మార్గంలో ఆగిపోయిన రోడ్లు పనుల గురించి పట్టించుకోలేదు. దీనిపై సాక్షిలో ఏడాది కాలంగా రోడ్డు ఇబ్బందుల గురించి వరుస కథనాలతో ప్రభుత్వానికి గుర్తు చేసింది. దీంతో కూటమి ప్రభుత్వంలో కదలిక రావడంతో ఎట్టకేలకు వారం రోజుల నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా యానాదివెట్టు, కంచరపాళెం వద్ద బావులను తలపించే గుంతలు ఏర్పడి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన ఈ ప్రాంతాల్లో బీటీ, సీసీ రోడ్ల ఏర్పాటు కోసం పనులు చేపడుతున్నారు.



యానాదివెట్టు వద్ద సిమెంటు రోడ్డు పనులు







కంచరపాళెం వద్ద తారు రోడ్డు పనులు, కడూరు కూడలి–చిన్న పాండూరు రోడ్డు దుస్థితిపై ప్రచురితమైన కథనాలు